# 'ఎవరు గెలిచారు?'

—బులుసు వేంకటరమణయ్య

పట్నం కాపరం కొంత విసుగెత్తి, జనసమ్మర్దంలోంచి తప్పించుకోవడానికి నేను నా మకాము ఊరికి మూడు మైళ్లలోవున్న మా తోట బంగాళాలోకి మార్చాను. మా తోటకి ఒక తట్టు ఒక చిన్న గుట్టా, ఒకవంపు చిన్న యేరూ నా మనస్సునిబాగా ఆకర్షించాయి. నాలాగే అయిదారుగురు ఉద్యోగులు ఆ సమీపంలోనే నివసించడం చేతా, చుట్టు పక్కల వ్యవసాయదారులు కుటీరాల్లో సకుటుంబంగా వుండడం చేతా— ఒంటరి కాపరం అనే భయం మాకెన్నడూ లేదు.

కాపరం ఎత్తికట్టినా వారానికి అధమం మూడు సార్లయినా పట్నానికి వెళ్ళడం తప్పేదికాదు. ఏ సభలు జరిగినా, ఏ కొత్త సినీమాలువచ్చినా, తప్పకుండా హాజరయ్యేవాడిని.

నేనా రోజు మా వూళ్ళో ఏర్పాటుచేసిన స్వదేశీ వస్తు ప్రదర్శనం సందర్భంలో జరిగే వేడుకలు చూడడానికి జట్కాలో బయలుదేరాను. ఒక మైలు వెళ్లే సరికల్లా - పట్నానికి వెళుతున్న పోలయ్య కనబడ్డాడు, జట్కాకి తప్పుకునినడుస్తూ.

పోలయ్య మా బంగళా సమీపంలో కాపురం వున్న కర్షకుడు. కష్టజీవి ; పొలం పనీ, కూలీనాలీ చేసుకుంటూ కాలం గడుపుతాడు. అతని భార్యా మా యింట్లో చిల్లర మల్లర పనులకి సాయంచేస్తూ వుంటుంది.

నేను బండీ ఆపి, అతన్ని లోపలికి ఎక్కించుకున్నాను.

'పట్నానికేనా ? పోలయ్యా !'

'అవునండి బాబుగారూ !'

'ఎండలో బయల్దేరావే !'

'అవునండి. నేను నాలుక్కా అక్కడుండాలి. కొంతసేపు అలసట తీర్చుకుంటేగాని కుస్తీ పోటీకి సిద్ధం కాలేనండి.'

నాకాశ్చర్య మనిపించింది. కాస్త వయస్సు మళ్ళి, బక్కచిక్కివున్న పోలయ్య — ఒక పూట తిండితినే పోలయ్య లోకయ్యలాంటి మల్లయుద్ధ ప్రవీణుడితో పోటీకి నిలవడం వింతల్లో వింత.

'నువ్వెవరితో కుస్తీపట్టాలో, ఆలోచించుకునే సిద్ధపడుతున్నావా పోలయ్యా ? అసలు నీకు కుస్తీ పట్టడం తెలుసా ?' అన్నాను భయంతో.

'బాబుగారి దయవల్ల నాకు దాంతో కాస్త పరిచయం వుందండి. అవతలవాడు లోకయ్య అని తెలిసే, వారం రోజులనుంచీ పొలంలో అభ్యాసం చేస్తున్నానండి. నేను గెలుస్తాననే అనుకుంటున్నానండి' అన్నా డతను వినయంతో.

'ఆ సంగతి నాకు తెలియక అన్నాను. అదీ గాక,లోకయ్యతో పోటీచెయ్యడం చాలాఅపాయకర మనుకుని అలా అడిగేను' అని నేనన్నాను, అతన్ని చిన్న బుచ్చకూడదనే భావంతో.

'అది సరేనండి. లోకయ్య గట్టివాడేకావచ్చు. అయినా నాకూ కొన్ని కిటుకులు తెలుసండి. ఇంతకీ పోటీకినిలవడమే నాపని. గెలవకపోయినాసరే, నాకు రావలసిన ముప్ఫయిరూపాయిలూ నాకు వస్తాయి.'

'అయినా యిది కొంత సాహసమైన పని పోలయ్యా !'

'చిత్తమండి, నేను పోటీకి నిలవకపోతే యీ డబ్బు ఎలావస్తుందండి ? ఆ డబ్బు రాకపోతే— ఎన్నాళ్లకిందటో కొంటానన్న పట్టు చీర మా యింటి దానికి ఎలావస్తుందండి !'

నాకు సంగతంతా అవగతమైంది. పోలయ్యకి భార్యమీద అభిమాన మెక్కువ. ఎన్నేళ్ళకిందటో ఆశపెట్టి వుంటాడు, సిల్కు చీరకొంటానని. ఇన్నాళ్లా దానికి కావలసిన మొత్తం ఒక్కసారిగా రావడమనేది పడలేదు. యీ ఛాన్సులో తప్పకుండా మొత్తం సొమ్ము ఒక్కసారి వస్తుంది. అతని సంగతి యెలావున్నా - అతని భార్యకి పట్టు చీర రావడం నిశ్చయం.

పోలయ్యకి భార్యమీదవుండే ప్రేమకి సంతోషమూ, అతని సాహసానికి విచారమూ నాకు ఒక్కసారిగానే కలిగాయి.

## ౨

తక్కిన వేడుకలని తొందరతొందరగా చూసి, నేను కుస్తీపట్లు జరిగేచోటుకే వేగంచేరుకుని,

టికెక్కట్టుకొని, మొదటితరగతిలో ముందువరసలో కూర్చున్నాను. సరిగ్గా అయిదు గంటలకి యిద్దరు ఫైల్ మానులూ రంగంలో ప్రవేశించారు. కాస్త పెద్దవాడవడంచేత పోలయ్యకే మొదటి ఛాన్సు యిచ్చారు. అతను ఉద్రేకంతో వచ్చి లోకయ్యని పడదోశాడు. ఇలా జరుగుతుందని యెవ్వరూ అనుకోలేదు. అందరితోపాటు నేనూ సంతోషంతో చేతులు చరిచాను. ఆవెంటనే లోకయ్య వొళ్లు దులుపుకుంటూ లేచాడు. పోలయ్య యీలోగా సిద్ధపడి, కొంతదూరాన్నుంచి పరుగెత్తి వస్తూ, లోకయ్యని పడతోశాడు మళ్లా. అందరూ పకపకనవ్వారు. మూడోసారి కూడా పోలయ్య లోకయ్యని పడదోయగలిగాడు, కొంతశ్రమపడినా కూడా.

తర్వాత లోకయ్య వంతువచ్చింది. పోలయ్యని నమిలిమింగెయ్యాలన్నంతకోపంతో అతను అమాంతంగా పోలయ్యమీదపడ్డాడు. పోలయ్య చిత్తుఅయిపోయినా, మళ్ళీలేచి లోకయ్యని కిందపడవేశాడు. రెండోసారి, లోకయ్య ఉద్రేకంతో వస్తూ పోలయ్యదవడమీద గట్టిగా కొట్టాడు. ఆ వూపు ఆపుకొనలేక పోలయ్య పక్కగా నేలమీద పడిపోయాడు. అతనితలకి గట్టిదెబ్బ తగిలింది. దవడపళ్ళు వూడిపోయి నోటంట రక్తంకారింది. దవడ బాగావాచింది. అలా లోకయ్య కొట్టడం అన్యాయమంటూ ప్రజ గోలచేశారు. నలుగురూ పోలయ్యని ఒక చిన్న షెడ్డులోకి తీసుకువెళ్ళారు. డాక్టరువచ్చి వెంటనే కట్టుకట్టాడు.

దాంతో మల్లయుద్ధ ప్రదర్శనం ముగిసింది. లోకయ్య గెలుపు ఓటమికిందే లెక్క అని అంతా అనుకున్నారు.

నేను రాత్రియింటికివచ్చి విచారించగా పోలయ్య సుఖంగా యిల్లుచేరాడనీ, ప్రమాదమేమీ లేదనీ, జ్వరంమాత్రం తీవ్రంగా తగిలిందనీ తెలిసింది. మరి నాలుగు రోజులయాక- పోలయ్య కర్రపట్టుకుని నడుస్తూ, ఎక్కడికో వెళుతూ కనబడ్డాడు.

'ఏం పోలయ్యా! ఎలాగున్న దేమిటి వొంట్లో?'

'జ్వరం తగ్గిపోయిందండీ. పళ్లూడిన బాధ మాత్రం యింకావుంది. అందుకనే మందుకోసం డాక్టరు బాబుదగ్గిరికి వెళుతున్నా.'

నాలాగే ఒక డాక్టరుకూడా అక్కడ ఒక బంగళాకట్టుకున్నాడులెండి, పోలయ్య అతనిదగ్గర మందుపుచ్చుకుంటున్నాడన్లేవుంది.

ఇంతలో—పోలయ్యకుటీరంలోంచి బయటికి వచ్చి నిలిచిన అతని భార్య కనబడింది. ఆమె మంచి పట్టుచీర కట్టుకునివుంది.

'అప్పుడే సిల్కుచీర కొన్నట్లున్నావే?'

'అవునండి, నిన్ననే తెప్పించాను.'

'పోలయ్యా! నువ్వు నీ భార్య ఆనందంకోసం చూస్తే, నువ్వే మూలపడవలసివచ్చింది. ముప్ఫయి రూపాయల కాశపడి నీ పళ్లు ఊడగొట్టుకొన్నావు. యింకా నెల్లాళ్లదాకా కూలికీ, నాలికీ వెళ్లలేవు. డాక్టరుకి కొంత యివ్వవలసివుందికదా! నువ్వు మంచిపని చేశావని నే ననుకోను.'

'నిజమేనండి. డాక్టరుగారికి మందులకి పాతిక రూపాయలవుతాయండి' ఆ ధర్మరాజు మందు ఖర్చే తీసుకుంటున్నా నన్నారండి. ఇంతకీ నేను ఇలా దెబ్బతింటానని అనుకున్నానా అండి! ఆ దుర్మార్గుడు అన్యాయంగా—అసూయపడికొట్టాడు గాని, నా సంగతెలావున్నా, నా భార్య తృప్తిపడింది, అంతేచాలండి! నెల్లాళ్లలో నేను మునపటి మనిషిగా అవుతానండి.'

'నువ్వుచెప్పినది సరే; కాని నువ్వు సంపాదించినదేముంది? ముప్ఫయి రూపాయిలు పోటీలో వస్తే పాతిక డాక్టరుకే యివ్వవలసివుండెనాయె; పైగా నెల్లాళ్ల జబ్బుబాధ.'

'డాక్టరుగారికి నా చేతంట ఒక్కదమ్మిడీ యివ్వనక్కర్లేదండి. నేను మొదటే యేర్పాటు చేసుకున్నాను. డాక్టరు బాబు బంగళా, ప్రహరీగోడ కొంత మరమ్మతు కోరుతున్నదండి. ఆ పని పూర్తిచేసి, నా ఋణం తీర్చుకుంటానండి. దాని వల్ల నా ఋణం తీరడమేకాదు; ఒక నెల్లాళ్ళు గ్రాసంకూడా దొరుకుతుందండి, మేం వుభయులమూ పనిచేస్తే.'